పేద విద్యార్థులపై అక్కసు

- తల్లికి వందనం అందని ద్రాక్షేనా?
- పచ్చిబియ్యంతో విద్యార్థులకు భోజనం
- చాలీచాలని పప్పుతో ఆకుకూర
- డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయుల బాధ్యతలు



పాఠశాల తరగతి గదిలో విద్యార్థులు

ఆకివీడు/ఉండి/కాళ్ల/పాలకోడేరు: విద్యా వ్యవస్థలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌ మోహన్‌రెడ్డి సమూల మార్పులు తీసుకొస్తే అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల పట్ల, మధ్యాహ్న భోజనం, విద్యా కిట్లపై ప్రభుత్వం తగిన శ్రద్ధ కనబర్చడం లేదంటున్నారు. వైఎస్‌ జగన్‌మోహన్‌ రెడ్డి హయాంలో విద్యా కిట్లకు ఆర్డర్‌ ఇవ్వడంతో సకాలంలో విద్యార్థులకు కిట్లు అందాయి. కొత్తగా చేరిన విద్యార్థులకు నేటికీ కిట్లు అందలేదు. విద్యా కిట్లు అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు అందాయి. కొత్తగా చేరిన విద్యార్థులకు కిట్లు అందాల్సి ఉంది.

పని సర్దుబాటు

ఉపాధ్యాయ ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయకపోవడంతో పలు పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు వర్కు సర్దుబాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని పలు స్కూళ్లలో ఎస్‌జీటీ, స్కూల్‌ అసిస్టెంట్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. హిందీ, ఉర్దూ లాంగ్వేజ్‌ పండిట్‌, పీఎస్‌ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఆయా పోస్టులు వర్కు సర్దుబాటుతో ఇతర ఉపాధ్యాయులను వినియోగిస్తున్నారు.

అమలు కాని అమ్మకు వందనం

వీరవాసరం: గత ప్రభుత్వంలో నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలలన్నిటినీ కార్పొరేట్‌ స్థాయిలో తీర్చిదిద్దారు. ప్రతి తరగతి గదిలోనూ ఫ్యాన్లు, లైట్లతో వెలుగులు నింపి విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక సదుపాయాలతో మౌలిక వసతులు కల్పించారు. పాఠశాల ప్రారంభంలోని విద్యా కానుకను విద్యార్థులకు ఉపయోగపడే పాఠ్యపుస్తకాలను, నోట్‌ పుస్తకాలను ఠంఛన్‌గా చెప్పిన ప్రకారం విద్యార్థులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం విద్యార్థులకు అమ్మకు వందనం పేరుతో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ రూ.15,000 చొప్పున తల్లుల ఖాతాలో వేస్తానని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. పాఠశాలలు ప్రారంభమై నేటికి నెలన్నర కావస్తున్న తల్లులకు ఖాతాలో వేస్తానన్న రూ.15 వేలను ఎవరికీ జమ చేసిన దాఖలాల్లేవు. ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15 వేలు చొప్పున వేస్తానని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం మీనమేషాలు లెక్కిస్తోంది. ఇప్పుడు ఇంటిలో ఒక్కరికి మాత్రమే పథకం వర్తింప జేస్తామంటూ లెక్కలు తీస్తోంది. కనీసం అమ్మకు వందనం నగదు మొత్తాన్ని తల్లులు ఖాతాలో ఎప్పుడు వేసేది కూడా కనీసం విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వం చెప్పకపోవడంతో అర్హులందరూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భీమవరం నియోజకవర్గంలోని భీమవరం మండలంలో 12 ఉన్నత పాఠశాలలు, 44 ప్రాథమిక పాఠశాలల్లో 3,260 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. భీమవరం పట్టణంలో 34 ప్రాథమిక పాఠశాలలు, 6 మున్సిపల్‌ ఉన్నత పాఠశాలలు, 5 ఎయిడెడ్‌ ఉన్నత పాఠశాలలు ఉండగా వీటిలో 6,352 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. అదే విధంగా వీరవాసరం మండలంలో 69 ప్రభుత్వ పాఠశాలలు, 10 ప్రైవేట్‌ పాఠశాలలు ఉన్నాయి.ఒకటి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు 6,759 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

పచ్చి బియ్యంతో పస్తులు



మధ్యాహ్న భోజన పథకం అమలుకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పచ్చి బియ్యంతో వండిన అన్నం విద్యార్థులకు పడటం లేదని వాపోతున్నారు. దీంతో విద్యార్థులు పస్తులుంటున్నారు. ఎన్నికల ముందు వరకూ విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిమిత్తం పాత బియ్యం సరఫరా చేయడంతో విద్యార్థులు భోజనాన్ని సంతృప్తిగా తిన్నారు. అయితే కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత పచ్చి బియ్యంతో వండిన అన్నం చిమిడిపోతుందని, కడుపు నొప్పి వస్తుందని విద్యార్థులు తినడం లేదు. నియోజకవర్గంలోని 17,256 మంది విద్యార్థుల్లో ఆరు వేల మందికి పైగా విద్యార్థులు ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తినకుండా ఇంటి వద్ద నుంచి క్యారేజీలు తెచ్చుకొని తింటున్నారు.

తల్లికి వందనమేదీ?



పేద విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసాగా అమ్మ ఒడి పథకంను గత ప్రభుత్వంలో వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. ప్రతీ ఇంట్లో ఒక విద్యార్థికి అమ్మ ఒడి రూ.15 వేలు అందజేశారు. అమ్మ ఒడి పథకాన్ని ఇంట్లోని పిల్లలందరికీ ఒక్కొక్కరికీ రూ.15 వేలు చొప్పున అందజేస్తానని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయలేదని పేద విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తల్లికి వందనం మాటెలా ఉన్నా, కనీసం అమ్మ ఒడి సొమ్ములైనా దక్కుతాయోలేదోనన్న సందిగ్ధంలో తల్లిదండ్రులు ఉన్నారు.

మారిన మెనూతో ఇబ్బందులు



క్యారేజీ భోజనం చేస్తున్న విద్యార్థులు

గత ప్రభుత్వంలో రుచికరమైన ఆహార పదార్థాలను వండి విద్యార్థులకు అందించేవారు. ప్రతి ఒక్క విద్యార్థి మనస్ఫూర్తిగా ఎంతో ఇష్టంగా ఆహారాన్ని భుజించడం జరిగేది. ప్రస్తుత ప్రభుత్వం పాఠశాల విద్యార్థుల మధ్యాహ్నం భోజనం మెనూ మార్చడం జరిగింది. కొత్త మెనూ ప్రకారం వండి వడ్డిస్తున్న ఆహార పదార్థాలను తినాలంటే విద్యార్థులు అయిష్టంగా ఉంటున్నారు. కొంత మంది విద్యార్థులు ఇంటి దగ్గర నుంచి క్యారియర్లు తీసుకువచ్చి భోజనాన్ని తింటున్నారు. విద్యార్థులకు ఇష్టమైన విధంగా పోషికాహారాన్ని అందించే సదుద్దేశంతో కొత్త మెనూ మార్చాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌ స్తంభాలపై నిర్లక్ష్యం



విద్యుత్‌ స్తంభానికి అల్లుకుపోయిన పాదులు

పాలకోడేరు: మండలంలోని వేంద్ర గ్రామంలో విద్యుత్‌ స్తంభం చుట్టూ మొక్కలు అల్లుకుపోయి పాదులు చుట్టుకు పోయినా సంబంధిత అధికారులు గానీ సిబ్బంది గానీ పట్టించుకోవడం లేదు. దీంతో ఒక్కొక్కసారి విద్యుత్‌ సరఫరాకు ఆటంకం కలుగుతుంది. వీటిపై విద్యుత్‌ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి, తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదిలక్ష్మి అమ్మవారికి శాకంబరి అలంకరణ



శాకంబరి అలంకరణలో ఆదిలక్ష్మి

భీమవరం: గునుపూడి గ్రామ దేవత శ్రీఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మవారికి భక్తులు, దాతల సహకారంతో శాకంబరి అలంకరణ నిర్వహించారు. అమావాస్య సందర్భంగా యామిజాల నరసింహ మూర్తి దంపతులతో అమ్మవారికి అభిషేకాలు విశేష కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. భక్తులకు దేవాలయ అభివృద్ధి కమిటీ అన్న ప్రసాదం అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి గొట్టుముక్కల నాగ సీతారామరాజు తదితరులు పర్యవేక్షించారు.

అల్లూరి స్మారక కట్టడం వద్ద మురుగు నీరు



మోగల్లులో అల్లూరి స్మారక కట్టడం వద్ద నిలిచిపోయిన మురుగు నీరు

పాలకోడేరు: దేశ భక్తులు, స్వాతంత్ర్యాభిలాషులు పుణ్య క్షేత్రంగా భావించే విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు స్వ గ్రామం అయిన మోగల్లులోని రహదారి అధ్వానంగా మారింది. పైగా ఆయన స్మారక కట్టడం వద్దనే వర్షం వచ్చిందంటే చాలు వర్షం నీరు రోజుల తరబడి నిలిచిపోయి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. ఇదేమి ఖర్మ అనుకుంటూ అల్లూరి అభిమానులు చాలా బాధ పడుతున్నారు. అలాగే దళితవాడలో రోడ్డుపై మురుగు నీరు పరిస్థితి ఇంకా చెప్పనక్కర్లేదు. అధికారులు ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

శాకంబరీగా ముత్యాలమ్మ



అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ చైర్మన్‌, భక్తులు

మొగల్తూరు: ఆషాఢ మాసం ఆఖరి ఆదివారం కావడంతో ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు. కాయగూరలు, ఆకుకూరలతో అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్‌ కడలి మాణిక్యాలరావు, సభ్యులతో పాటు గ్రామ పెద్దలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, సిబ్బంది క్యూలైన్లు ఏర్పాటు చేసి, అమ్మవారి దర్శనాన్ని కల్పించారు.

స్థిరంగా గోదావరి ప్రవాహం



నరసాపురం వలంధర్‌రేవు వద్ద నిలకడగా గోదావరి ప్రవాహ ఉధృతి

నరసాపురం: వశిష్ట గోదావరి ఉధృతి స్థిరంగా కొనసాగుతుంది. గత నాలుగు రోజులుగా పరిస్థితిని పరిశీలిస్తే నీటి ప్రవాహ వేగం క్రమేపీ తగ్గుతుంది. అయితే పూర్తి స్థాయిలో మాత్రం పరిస్థితి అదుపులోకి రాలేదు.స ముద్ర సంగమ ప్రాంతం కావడంతో ఎగువ ప్రాంతం నుంచి నీరు వచ్చి చేరే కొలదీ ఇక్కడ నీటి మట్టం పెరుగుతుంది. భద్రాచలంలో నీటిమట్టం తగ్గే కొద్దీ..ఇక్కడ నీటిమట్టం పెరుగుతుంది. దీంతో గోదావరిలో స్థానికంగా వరద ప్రవాహ ఉధృతి భయపెడుతుంది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు కొనసాగడం లేదు. మరో నాలుగు రోజులపాటు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

ఎక్కడి చెత్త అక్కడే

డంపింగ్‌ యార్డ్‌ ఉన్నా నిరుపయోగం



వేంద్ర ప్రధాన రహదారి పక్కనే చెత్తను డంప్‌ చేసిన దృశ్యం

పాలకోడేరు: మండలంలో మేజర్‌ పంచాయతీ వేంద్ర గ్రామంలోని పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. రహదారి పక్కనే చెత్త వేస్తున్నారు. దీంతో ప్రయాణికులు దుర్గంధాన్ని భరించలేక ముక్కు మూసుకుంటున్నారు. అసలే వర్షా కాలం పలు రోడ్లలో చెత్తను డంప్‌ చేయడం వలన దోమలు విలయ తాండవం చేస్తున్నాయి. దీంతో రోగాలను బారిన పడుతున్నామని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు దోమల నివారణకు ఫాగింగ్‌ గాని, వ్యాధులు ప్రబలకుండా కనీసం బ్లీచింగ్‌ చల్లడం లేదని ఆరోపిస్తున్నారు. వేరే మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఈ గ్రామానికి ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టడం వలన ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నాయని పలువురు వాపోతున్నారు. గ్రేడ్‌ 5 కార్యదర్శి కూడా గ్రామాన్ని సందర్శించకపోవడం వలన సమస్యలు పెరిగిపోతున్నాయని పూర్తి స్థాయిలో కార్యదర్శి బాధ్యత నిర్వర్తించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. డంపింగ్‌ యార్డ్‌ ఉన్నా ఉపయోగించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు.

పంట కాలువ ప్రక్షాళన



అన్నయ్య కోడు పంట కాలువను పరిశీలిస్తున్న రైతులు

కాళ్ల: పంట కాలువల ప్రక్షాళనకు ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘు రామకృష్ణరాజు చూపుతున్న చొరవ అభినందనీయమని రైతులు మంతెన వెంకట శివాజీ రాజు, కలవపూడి సర్పంచ్‌ గేదెల జాన్‌ అన్నారు. కాళ్ల మండలం కలవపూడి పరిధిలో రైతులు సహకారంతో ప్రక్షాళన చేపట్టిన అన్నయ్య కోడు పంట కాలువను ఆదివారం రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ జువ్వలపాలెం నుంచి ప్రాతాళ్ళమెరక, పల్లిపాలెం, కలవపూడి, మోడీ, వావిలాలపాడు, మామిడిపూడి గ్రామాలకు తాగు, సాగునీరు అందించే అన్నయ్యకోడు పంట కాలువ గత 15 ఏళ్లుగా ఎటువంటి ప్రక్షాళన జరగకపోవడంతో పూర్తిగా గుర్రపు డెక్క, నాచు, కిక్కిసతో నిండిపోయి నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. మంతెన వెంకట శివాజీరాజు, గోకరాజు వెంకట శివరామరాజు, మంతెన పెదనరసింహారాజు, ముదుండి శ్రీనివాసరాజు, నల్లపరాజు వెంకటపతిరాజు, తదితరులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

14న ఎస్‌ఆర్‌కేఆర్‌లో 24 గంటల హేకత్తాన్‌



హేకత్తాన్‌ పోస్టర్‌ విడుదల చేస్తున్న కళాశాల సెక్రటరీ అండ్‌ కరస్పాండెంట్‌ ఎస్‌ఆర్కే నిశాంత్‌ వర్మ

భీమవరం: భీమవరం ఎస్‌ఆర్‌కేఆర్‌ ఇంజనీరింగ్‌ కళాశాలలో ఈనెల 14న 24 గంటల పాటు నిర్విరామంగా హేకత్తాన్‌ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రిన్సిపల్‌ డాక్టర్‌ కె.వి మురళీ కృష్ణంరాజు చెప్పారు. హేకత్తాన్‌ పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్‌ కరెస్పాండెంట్‌ సాగి రామకృష్ణ నిశాంత్‌ వర్మ ఆదివారం కళాశాల మేనేజ్‌మెంట్‌ మీటింగ్‌ హాల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ ఎం జగపతిరాజు మాట్లాడుతూ వేదిక్‌ విజన్‌ పేరిట ఈనెల 14వ తేదీ వరకు టెక్నికల్‌ ఈవెంట్‌ బూట్‌ క్యాంప్‌ నడుస్తుందని, 14 నుంచి హేకత్తాన్‌ కార్యక్రమం ప్రారంభమవుతుందని వివరించారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ విభాగం హెడ్‌ డాక్టర్‌ వి చంద్రశేఖర్‌, ఇంజనీరింగ్‌ కెమిస్ట్రీ హెడ్‌ డాక్టర్‌ పి భవాని, ఫిజికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ పి సత్యనారాయణ రాజుతో పాటు కో ఆర్డినేటర్స్‌ పవన్‌, రఘురాం, స్వరూప, విద్యార్థి ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలగాలి



మావుళ్లమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావంతో మెలిగినప్పుడే సమాజంలో శాంతి నెలకొంటుందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పట్టణంలోని 3వ వార్డులో 32వ ఆషాఢ మాస మావుళ్లమ్మవారి జాతర మహోత్సవాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శక్తి వేషాలు, గరగల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో జాతర వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జాతర మహోత్సవ నిర్వాహకులు యాతం శ్రీను, మాజీ కౌన్సిలర్‌ యాతం నాగలక్ష్మి, టీడీపీ రాష్ట్ర నాయకులు మెంటే పార్థసారధి, జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్‌, ఏఎంసీ మాజీ చైర్మన్‌ కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై విత్తనాలు

నరసాపురం రూరల్‌: డివిజన్‌లోని నరసాపురం, మొగల్తూరు, యలమంచిలి మండలాల్లో ఇటీవల కురిసిన అధిక వర్షాలు, వరదలకు నారుమడులు నష్టపోయిన రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్లు ఏడీఏ ఈదా అనిల్‌కుమారి తెలిపారు. డివిజన్‌ పరిధిలో 390.37 ఎకరాలకు సంబంధించిన నారుమడులు పాడైనట్లు గుర్తించామన్నారు. వీరందరికి 80 శాతం రాయితీతో ఎంటీయూ 1153 రకం విత్తనాలను రైతు సేవా కేంద్రాల ద్వారా అందించనున్నట్లు ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 30 కిలోల విత్తనాల బస్తా పూర్తి ఖరీదు రూ.1,134 కాగా 80 శాతం రాయితీ ధర రూ.907 తగ్గించి కేవలం రూ.227లకు ప్రభుత్వం ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు. ముంపునకు గురైన నారుమడులు కలిగిన రైతులు ఈ ఎంటీయూ 1153 వరి రకాన్ని ఊడ్చుకోవలసిందిగా ఆమె పేర్కొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలు ప్రారంభం



భీమవరం: స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం: స్వాతంత్ర సమరయోధుల ఆదర్శాలను ముందుకు తీసుకువెళ్లి వారి త్యాగాలకు ఫలితాలను ప్రజలకు అందించాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం క్విట్‌ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ పక్షోత్సవాలను ఎమ్మెల్యే అంజిబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా క్విట్‌ ఇండియా అమర వీరుల స్థూపం వద్ద అమర వీరులకు జోహార్లు తెలుపుతూ నివాళులర్పించారు. భీమవరంలో క్విట్‌ ఇండియా ఉద్యమం చరిత్రలోనే సువర్ణ అధ్యాయంగా మిగిలిందని, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పక్షోత్సవాలుగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మెంటే పార్థసారధి, కోళ్ల నాగేశ్వరరావు, చెన్నమల చంద్రశేఖర్‌, పాతూరి బాపిరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, ఇందుకూరి ప్రసాదరాజు, అరసవల్లి సుబ్రహ్మణ్యం, నందమూరి రాజేష్‌, ఎస్‌ కే చాన్‌ భాషా, ఎన్‌ సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్‌ స్వర్ణోత్సవ క్రీడా పోటీలు

యలమంచిలి: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ (యూటీఎఫ్‌) సంఘం ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ నెల 10న స్వర్ణోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆదివారం మేడపాడు హైస్కూల్లో యూటీఎఫ్‌ ఉపాధ్యాయులకు టీచర్స్‌ ఒలింపిక్స్‌ నిర్వహించారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా వాలీబాల్‌, టెన్నికోయిట్‌, త్రోబాల్‌, జావెలిన్‌ త్రో, చదరంగం, క్యారమ్స్‌ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మేడపాడు ఎంపీటీసీ డేగల సూర్యప్రభ ప్రారంభించారు. కార్యక్రమంలో మేడపాడు మాజీ సర్పంచ్‌ అడ్డాల వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గంధం సత్యకీర్తి, అడబాల రామ్మోహనరావు, యూటీఎఫ్‌ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరుగేది..?



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో మరుగు లేని మరుగుదొడ్లు

పాలకొల్లు సెంట్రల్‌: పంచారామ క్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో మరుగుదొడ్లకు మరుగే లేకుండా పోయింది. ఆలయంలో ఈవో కార్యాలయం వెనుక పురుషులు, మహిళలకు మరుగుదొడ్లు ఉన్నాయి. ఇందులో పురుషులకు సంబంధించిన మరుగుదొడ్లకు పైన గాని, లోపలకు వెళ్లే ద్వారం డోరుఉన్నా గాని మరుగు లేకుండాపోయింది. టాయిలెట్స్‌కు వెళ్లిన వారు డోర్‌ వేసుకుంటే అతను బయటకు వచ్చేవరకూ మరొకరు వెళ్లడానికి ఉండదు. అలా అని డోర్‌ వేయకపోతే ఓపెన్‌గా ఉంటుంది. పైన చుట్టూ ఉన్న భవనాలు కనిపిస్తుంటాయి. కార్తీకమాసం వచ్చిందంటే టాయిలెట్స్‌ మార్గం గుండానే అభిషేకాల మండపంలోకి వెళ్లాల్సి ఉంటుంది. టాయిలెట్స్‌కు వెళ్లేవాళ్లా లేక అభిషేకానికి వెళ్లేవాళ్లా అనేది తెలియని దుస్థితి. పూజకు ఎంతో నిష్ఠగా వెళ్లాలనుకునే భక్తులకు టాయిలెట్స్‌కు వెళ్లి వచ్చే భక్తులు తగులుతుండడంతో భక్తులు మానసికంగా అసహనానికి గురవుతున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు మరుగుదొడ్డికి పైన షెడ్‌ వేయించి, ఆటోమేటిక్‌ డోర్‌ పడేలా ఏర్పాటు చేస్తే మరుగుదొడ్లకు మరుగు ఏర్పడుతుందని భక్తులు కోరుకుంటున్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై నిరసన

భీమవరం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో 59 కులాల మధ్య గొడవ పెట్టారని, దేశ ప్రజయోజనాలు తాకట్టు పెట్టి కులాల మధ్య చిచ్చు రేపుతున్నారని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆర్గనైజర్‌ కోనా జోషఫ్‌ అన్నారు. భీమవరం అంబేడ్కర్‌ సెంటర్‌ లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. జోషఫ్‌ మాట్లాడుతూ రాష్ట్రపతి పరిధిలో గల 241 ఆర్టికల్‌ ప్రకారం కాకుండా తీర్పు రావడం దురదృష్టకరమని అన్నారు. అడ్వకేట్‌ తాళ్లూరి మధు మాట్లాడుతూ మిగతా కులాల శ్రేయస్సు కోరి రివ్యూ పిటిషన్‌ను పరిగణలోకి తీసుకుని తీర్పును నిలుపుదల చేయాలని కోరారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర్‌ కుమార్‌ మాట్లాడుతూ ఈ తీర్పును అంగీకరిస్తే భవిష్యత్తులో రిజర్వేషన్లను పూర్తిగా తీసివేయడానికి కూడా కేంద్ర ప్రభుత్వం వెనుకడదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లూరి సంపత్‌ కుమార్‌, గొల్లమండల స్టాన్లీ, భీమవరం యూనియన్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ బేతాళ కమలకర్‌, ఇది రవికుమార్‌, బుంగా ఆదాము, గోల్లా రాజుకుమార్‌, పట్టెం సుధాకర్‌, జి దినేష్‌, పాలపర్తి జోనా, పిల్లి అమూల్యరావు, విపర్తి సత్యవేణి, మాణిక్యాలరావు, శాంతకుమారి, రంజిత పాల్గొన్నారు.

యువకుల మధ్య గొడవ

పాలకోడేరు: పని చేసే చోట రెండు వర్గాలకు చెందిన యువకుల మధ్య వచ్చిన తగాదా రెండు కులాల ఘర్షణగా రూపుదాల్చి, కొట్టుకునే పరిస్థితి వరకూ వెళ్లింది. వివరాలు ఇలా ఉన్నాయి. పాలకోడేరుకు చెందిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గానికి చెందిన యువకులు భీమవరంలోని ఒక రొయ్యల కంపెనీలో పని చేస్తున్నారు. ఈ నేపథ్యంలో యువకుల మధ్య కొద్ది రోజుల క్రితం ఘర్షణ ఏర్పడింది. దీంతో ఆదివారం బీసీ సామాజిక వర్గానికి చెందిన కొంతమంది యువకులు ఎస్సీ సామాజిక వర్గం యువకులపై దాడి చేయడంతో అభిరామ్‌ అనే యువకుడికి గాయం అయింది. గాయపడిన యువకుడు భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడి చేసిన బీసీ సామాజిక వర్గం యువకులు పోలీస్‌ స్టేషన్‌కు చేరుకోవడంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన యువకులు కూడా పోలీస్‌ స్టేషన్‌కు చేరుకుని లోపల ఉన్న వారిని బయటికి పంపించాలని గొడవ చేయడంతో పరిస్థితి ఉద్రిక్తకు దారి తీసింది. భీమవరం నుంచి సీఐ ఆధ్వర్యంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి 9 మంది యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

అక్రమ మద్యం కేసులో ఇద్దరి అరెస్టు

పాలకోడేరు: అక్రమ మద్యం కలిగి ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు. వీరిని పెన్నాడలో పట్టుకున్నట్లు ఆ మద్యం యానాం నుంచి తీసుకు వచ్చినట్లు తెలిపారు. వీటి విలువ రూ.4,902 అని ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.

మేత బస్తాలు, కోళ్లు చోరీ

ఉండి: ఆక్వా చెరువు వద్ద రొయ్యల మేతబస్తాలు, కోళ్ల దొంగతనంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కోలమూరుకు చెందిన నంద్యాల ఉదయ భాస్కరరావు అనే ఆక్వా రైతు చెరువులో మేత వేసేందుకు 20 బస్తాలను గత నెల 28వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో తెచ్చుకుని తన ఇంటి వెనుక వాటిని భద్రపరచాడు. అయితే తెల్లవారిన తరువాత అనగా 29వ తేదీ ఉదయం చూసే సరికి 20 బస్తాలతో పాటు అక్కడే ఉన్న ఆరు పెంపుడు కోళ్లు కూడా కనిపించకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

ఉండి: మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని చెరుకువాడ చినపేటకు చెందిన ఓ మహిళ పట్ల అదే ప్రాంతానికి చెందిన బొడ్డు మంగరాజు అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంతో పాటుగా ఆమె కనిపించిన ప్రతీ సారి ఆమెను వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని సదరు మహిళ తన భర్తకు చెప్పడంతో గత నెల 17వ తేదీన అతనిని అడిగేందుకు వెళ్లిన భర్తపై అతడు దాడి చేసినట్లు మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై ఎస్సై ఎం.లక్ష్మణ్‌ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.